క్లుప్తంగా

22 నుంచి చండీ హోమం

దర్శి: స్థానిక గ్రామ దేవత అంకాలమ్మ తల్లి ఆలయంలో చండీ సప్తశతి పారాయణం, చండీ హోమాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కర్శా రమణారెడ్డి తెలిపారు. అమ్మవారికి నవరాత్రులు నిర్వహించి అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ సాయంత్రం కుంకుమ పూజ జరుగుతుందని చెప్పారు. 22వ తేదీ నుంచి కార్తీక మాసం పూర్తయ్యే వరకు దీక్షా స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈవో ఎండీ ఖాసిం అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి, యండ్రపల్లి ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఎండీఎంలను తనిఖీ చేసి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడంతో పాటు రాయడం, చదవడం నేర్పించాలని చెప్పారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమాలను అనుసరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. పాఠశాల, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో హేమలత భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక పడమటి బజారులోని బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పోషక ఆహార పదార్థాలను సద్వినియోగం చేసుకొని చిన్నారుల ఎదుగుదలకు దోహదపడాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.పద్మజ, కార్యకర్తలు షేక్ శంషాద్, తిరుపాలమ్మ, షేక్ నసీమా, పద్మ, రూత్‌మేరీ, రామసుబ్బమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 సాఫ్ట్‌వేర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దస్తావేజు లేఖరులు (డాక్యుమెంట్ రైటర్లు) పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జోష్నాబాయికి వినతి పత్రం అందజేశారు. సాఫ్ట్‌వేర్‌తో తమ సమయం వృథా కావడంతో పాటు రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. లేఖరుల నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, బొర్రారెడ్డి, ఆంజనేయులు, యోహాన్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు

దర్శి: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్, సీనియర్ సైంటిస్ట్ రవీంద్ర బాబు అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెంలో జామ, మామిడి సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. రవీంద్రబాబు మాట్లాడుతూ జామ, మామిడి తోటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, తెగుళ్ల యాజమాన్యం, పురుగుమందుల పిచికారీ విధానాలు, కాయ కోత అనంతరం యాజమాన్య పద్ధతులు వివరించారు. జామ పంటలో నులిపురుగులు, పండు ఈగ అధికంగా ఆశించి జామ దిగుబడిని తగ్గిస్తాయని పేర్కొన్నారు. నులిపురుగులు ఆశించిన మొక్కల ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోయి మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. కొమ్మలు, రెమ్మలు ఎండిపోయి కాపు తగ్గిపోతుందన్నారు. మామిడిలో కాయ కోత అనంతరం కత్తిరింపులు జరిపి సేద్యం చేసి ఒక చెట్టుకు ఒక కేజీ యూరియా, 2.5 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 700 గ్రాముల పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారి రవి వెంకన్నబాబు మాట్లాడుతూ రాయితీలు వినియోగించుకోవాలని చెప్పారు.

పుల్లాయపల్లెకు సాగర్ నీరు బంద్



అలంకారప్రాయంగా ఓహెచ్ ట్యాంక్

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి పుల్లాయపల్లెకు సాగర్ నీరు సరఫరాగాక రెండు నెలలు కావొస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా స్పందించిన దాఖలాలు లేవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చేతి పంపులు మొరాయిస్తున్నాయని తెలిపారు. గ్రామంలో సుమారు 60 కుటుంబాలు వారు నివసిస్తున్నారు. సాగర్ నీరు రాక పోవడంతో చేతి పంపులో నీరు తాగి వ్యాధులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారానికి రెండు, మూడు రోజులకైనా సాగర్ నీరు వచ్చేది. నేడు రెండు నెలలు కావస్తున్నా అధికారులు చుక్క నీరు సరఫరా చేయలేదు. పొలాలకు వెళ్లి పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి నీరు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండు నెలల నుంచి సాగర్ జలాలు రాకపోవటం వాస్తవేమనని, మరమ్మతుల కారణంగా నీరు సరఫరా కావడం లేదన్నారు. గ్రామస్తులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గతంలో సాగర్ నీరు సరఫరా అయ్యేవి:



గతంలో మా ఊరికి సంపూర్ణంగా సాగర్ జలాలు సరఫరా అయ్యేవి. రెండు నెలల నుంచి నీరు సరఫరా కావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మా గ్రామానికి సాగర్ జలాలు సరఫరా చేయాలి.

– బి.కోటయ్య, పుల్లాయపల్లె

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

- హ్యాండిల్ లాక్ వేయడం మరవొద్దు
- స్వీయ జాగ్రత్తలు అవసరమంటున్న పోలీసులు



బైకు చోరీ చేస్తున్న యువకుడు

పెద్దదోర్నాల: ద్విచక్ర వాహనాల దొంగతనాలు ప్రజలను కలవరానికి గురి చేస్తున్నాయి. ఇళ్లు, బస్టాండ్‌లు, సినిమా హాళ్లు, ప్రార్థనాలయాలు, ప్రభుత్వ అస్పత్రులు, కళాశాలలు ఇలా ఎక్కడ వాహనాలు నిలిపినా అవి క్షణాల్లో మాయమవుతున్నాయి. విలాసాలు, మత్తు వంటి దురవాట్లకు బానిసలైన యువకులు దారి తప్పి చోరీలకు పాల్పడుతున్నారని పోలీసు అధికారులు చెబుతున్నారు. లక్షలు పోసి కొన్న ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు గురవుతుండటంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. దీంతో పాటు తమ వాహనాలు దొంగతనానికి గురి కావడానికి హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లు వేయక పోవటం వంటి నిర్లక్ష్యం కూడా చోరీలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో తరుచూ చోటు చేసుకుంటున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలపై వాహన యజమానులు కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

సరిహద్దు జిల్లాలకు తరలి వెళ్తున్న బైకులు

జిల్లాలో పెద్దదోర్నాల మండలం సరిహద్దు మండలంగా ఉంది. మండలం నుంచి ఓ వైపు 30 కిలో మీటర్లు వెళ్తే నంద్యాల జిల్లా ఆత్మకూరు, మరో వైపు 10 కిలో మీటర్లు వెళితే శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలు ఉన్నాయి. దీంతో పాటు మరో పది కిలో మీటర్లు వెళ్తే.. తెలంగాణ ప్రాంతం వస్తుంది. ఈ నేపథ్యంలో చోరీకి గురైన వాహనాలు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మండల కేంద్రంలోని ప్రార్థనాలయం ఎదుట యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి రాత్రి బస చేశాడు. మరుసటి రోజు ఉదయం యువకుడి వాహనం మాయమైంది. చోరీకి గురైన ఈ వాహనం విలువ సుమారు రెండు లక్షల రూపాయలకు పైగానే ఉంటుందని వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనాన్ని నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు.

వాహనదారులు స్వీయ జాగ్రత్తలు పాటించాలి:

ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామంది వాహనదారులు తమ బైక్‌లకు హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లు వేయక పోవటం వల్లే వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దీంతో పాటు నిర్మానుష్య ప్రాంతాలు, సీసీ టీవీలు లేని చోట వాహనాలను ఎక్కువ సేపు నిలపటం మంచిది కాదు. కొందరు వాహనాలకు తాళాలు అలాగే వదిలి వెళ్తున్నారు. జీపీఎస్ ట్రాకర్లు, అలారం సిస్టం వంటి అధునాతన భద్రత వినియోగించుకోవాలి.

– మహేష్, ఎస్సై, పెద్దదోర్నాల

ఎమ్మెల్యే తాటిపర్తి మానవత్వం



క్షతగాత్రులకు ధైర్యం చెప్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మానవత్వం చాటుకున్నారు. గురువారం తాడేపల్లిలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి యర్రగొండపాలెం వస్తున్న సమయంలో పల్నాడు జిల్లా కోటప్పకొండ రోడ్డులోని యడవల్లికి సమీపంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో మోటారు బైక్ యాక్సిడెంట్ జరిగింది. ఆ బైక్‌పై మద్దిరాలకు చెందిన దంపతులు చిలకలూరిపేటకు వెళ్తున్నారు. రోడ్డుపై పెద్ద గుంత ఉన్న విషయాన్ని గమనించకుండా ముందుకు వెళ్లారు. దీంతో ఆ బైక్ గుంతలో పడటంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి రోడ్డుపై పడి ఉన్న వారిని కూర్చోబెట్టి ధైర్యం చెప్పారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా తక్షణ స్పందన లేకుండా పోయింది. ప్రమాద స్థలానికి 108 వాహనం చేరేందుకు 50 నిమిషాలు పడుతుందని సమాధానం రావడంతో ఆ వెంటనే ఒక ఆటోను పిలిపించి క్షతగాత్రులను ఎమ్మెల్యే తాటిపర్తి దగ్గరుండి వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదం, అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పట్టణానికి చెందిన గోళ్ల కృష్ణారావు, మండలంలోని అమానిగుడిపాడు గ్రామానికి చెందిన మంద నాగయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ వివరాలు తెలుసుకున్న ఆయన వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. అనంతరం అమానిగుడిపాడులో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మందా యేసోబు భార్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దొగిపర్తి సంతోష్ కుమార్ ఉన్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



బ్యాంకు రుణాల గురించి వివరిస్తున్న మేనేజర్ రాజశేఖర్

కురిచేడు: మండలంలోని ఆవులమల్ల పంచాయతీ ప్రతిజ్ఞపురి కాలనీలో శుక్రవారం డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ దర్శి నియోజకవర్గ కన్వీనర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రాలో ఉన్న ప్రతి మహిళ గ్రూపుల్లో పొదుపు సక్రమంగా కట్టుకోవాలని, ప్రతి ఒక్క మహిళ గ్రూపులో చేరాలని కోరారు. గ్రూపుల ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని, బయట ప్రైవేట్ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటే అధిక వడ్డీలు కట్టలేక ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫైనాన్స్ బ్యాంకుల్లో అసలు వడ్డీలకు రుణాలు తీసుకోవద్దని హితవు పలికారు. గ్రూపుల్లో లేని వారు కూడా గ్రూపుల్లో చేరాలని, వ్యాపారాలు చేసుకునే వారికి రుణాలు కూడా ఇస్తామని, బ్యాంకు వ్యవస్థ అంటే డబ్బులు తీసుకోవడం కట్టుకోవడమే కాదని, వడ్డీ ఎంత పడుతుంది, ఎంత టైం కడుతున్నారనేది కూడా చూసుకోవాల్సిన బాధ్యత రుణం తీసుకునే వ్యక్తికి ఉండాలన్నారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించారు. డీపీఆర్సీ కో ఆర్డినేటర్ నాగమణి మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ద్వారా నాణ్యమైన డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఉపయోగించుకోవడంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వీవోఏ వీరాంజనేయులు, అటవీ హక్కుల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ చడమల కుమారి పాల్గొన్నారు.

దొనకొండలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు



మాట్లాడుతున్న సీడీపీవో పరిమళ

దొనకొండ: రాష్ట్రీయ పోషణ 8వ మాసోత్సవాలను దర్శి సీడీపీఓ పరిమళ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎండీ దావూద్, వైద్యాధికారులు ప్రశాంత్‌కుమార్, చంద్రమౌళి, ఐటీసీ ప్రథమ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ పరిమళ మాట్లాడుతూ కుటుంబ పోషణలో పురుషుల భాగస్వామ్యం, ప్రాముఖ్యత గురించి వివరించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రజలందరూ మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. 3 నుండి 6 ఏళ్ల పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రొటీన్లు, విటమిన్లు, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

105 మంది మహిళలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ కుమార్

కురిచేడు: స్వస్త్ నారీ సశక్త పరివార్ కార్యక్రమాన్ని శుక్రవారం పడమర గంగవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహించారు. 105 మంది మహిళలకు అన్ని రకాల పరీక్షలు వైద్యాధికారి రవితేజ కుమార్ చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్డులు నమోదు చేయించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సూపర్‌వైజర్లు, సర్పంచ్ కాసు భాస్కర్‌రెడ్డి, సీహెచ్ఓ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

చినుకు పడితే చీదరే

- బయట కాలు పెట్టలేని దుస్థితి



పేరంబొట్లపాలెంలో అంతర్గత రోడ్డు ఇలా..

కురిచేడు: మండలంలోని పేరంబొట్లపాలెంలో చినుకు పడితే ఇళ్ల నుంచి బయట కాలు పెట్టాలంటే భయపడుతున్నారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు బురదమయమై జారిపోతుంటాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఆ రోడ్లపై నడవాలంటే ఎక్కడ పడిపోతామో అనే భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో అందరూ వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలే. పగలంతా కష్టపడి పొలాల్లో పనులు చేసి సాయంత్రానికి ఇంటికి వచ్చి పనులు చేసుకోవాలన్నా, నీరు తెచ్చుకోవాలన్నా ఎక్కడపడి కాలు, చేయి విరగ్గొట్టుకుంటామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కురిచేడు నుంచి వచ్చేందుకు కూడా నేటికీ సక్రమమైన రోడ్డు, రవాణా సౌకర్యం లేక కాలినడకే ఆ గ్రామస్తులకు దిక్కయింది. ప్రభుత్వాలు మారుతున్నా తమ తలరాతలు మారడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాన్ని అధికారులు, పాలకులు పట్టించునే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మించి డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇలా..ఉంటే రోగాలు రావా?

- మురుగు నిల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు



మురుగులో నిలిచిన నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు

కురిచేడు: స్థానిక వినుకొండ రోడ్డు షిరిడీ సాయి బాబా ఆలయం ఎదుట మూలమలుపులో మురుగు నిల్వలు పేరుకుని దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. గ్రామంలోని కొన్ని ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి అక్కడ నిల్వ చేరుతోంది. అక్కడి నుంచి నీరు ఎటూ వెళ్లేందుకు డ్రైనేజీ లేక పోవడంతో అక్కడే నిలబడిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దానికి తోడు దాని పక్కనే కళ్యాణ మండపం ఉండటంతో ప్రతి కార్యక్రమంలో ఉపయోగించిన డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు గాలికి వచ్చి ఆ మురుగులో చేరిపోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు పొంగి రోడ్డుపై నిలిచిపోతోంది. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి చెత్తతో కలిసి మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్డుపై చేరాయి. ఆ రోడ్డు నుంచి శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. అందరూ ఆ మురుగు నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. అంతే కాకుండా అంటువ్యాధులు ప్రబలుతాయనే భయాందోళనలు ఆ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నిల్వలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వరిలో సస్యరక్షణపై అవగాహన ఉండాలి

త్రిపురాంతకం: రైతులు వరి పంటలో చీడ పీడల నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ సంఘమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మేడపిలో వరిలో సస్యరక్షణ చర్యలపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. వరి దుబ్బుల్లో మిత్ర పురుగులు, శత్రు పురుగులపై అవగాహన కల్పించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

మెడికల్ కాలేజీ పోరుకు తరలిన వైఎస్సార్ సీపీ నేతలు



మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద తాళ్లూరు వైఎస్సార్ సీపీ నాయకులు

దొనకొండ: మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రైవేటీకరించడానికి వ్యతిరేకంగా శుక్రవారం ఆ కాలేజీ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది దొనకొండ నుంచి బయల్దేరి వెళ్లారు. వారిలో నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వినుకొండ కొండలరావు, ఐటీ వింగ్ శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, గొంగటి పోలిరెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ద్వారకవర్ల చెంచిరెడ్డి, మాజీ సర్పంచ్ రామగిరి హుస్సేన్, పులిమి శివ, కిన్నెర ప్రసాద్ ఉన్నారు.

తాళ్లూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం మార్కాపురంలో జరిగిన నిరసన కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమానికి హాజరైన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొల్ల భాస్కర్, దర్శి మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసరెడ్డి, నాయకులు గంథం బుజ్జి, యానం గోపీకృష్ణ, కూలూరి అంజిరెడ్డి ఉన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఓబులరెడ్డి, గుమ్మా ఎల్లేష్ యాదవ్, వై.వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, కె.జానకి రఘు, కె.సత్యనారాణచౌదరి, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దొగిపర్తి సంతోష్ కుమార్, గోళ్ళ కృష్ణారావు, సూరె శ్రీనివాసులు, ఒంగోలు సుబ్బారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్, హరిబాబు నాయక్, చిట్టి వెంకటేశ్వరరెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, లాలు నాయక్, పల్లె సరళ, శారా, దర్శనం నాగయ్య, చెవుల అంజయ్య, జి.రాజశేఖరరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, షేక్.షెక్షావలి, దూదేకుల కాశింపీరా, పి.మల్లికార్జున, దొండేటి కృష్ణారెడ్డి, ప్రసాద్, ఆవుల వీర కోటిరెడ్డి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఎం.బద్దునాయక్, ఎ.రమణారెడ్డి, బాలకోటిరెడ్డి, గురువారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వెంగళ్‌రెడ్డి, నారాయణరెడ్డి, కాశిరెడ్డి, సుబ్బారావు, సుబ్బారెడ్డి, జైనుద్దీన్, అంగిరేకుల ఆదినారాయణ, కొంతి నాగార్జునరెడ్డి, డి.వెంకటరెడ్డి, వి.ప్రసాద్, యేర్వ సహదేవుడు, మూల సత్యంరెడ్డి, ఆవుల నాగిరెడ్డి, యేర్వ శేషసేనారెడ్డి, వెంకటేశ్వర్లు, రంగబాబు, వెంకటేశ్వరరెడ్డి, గురువారెడ్డి, గాలయ్య, సుబ్రమణ్యం, మల్లికార్జున్, వెంకల్‌రెడ్డి, కె.సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, ముసలారెడ్డి, దుద్దేల వెంకటరెడ్డి, మూల రమణారెడ్డి, వేశపోగు ప్రసాద్, పులి సుబ్బయ్య, బట్టగిరి రమణారెడ్డి, కొంతి నాగార్జునరెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, పొందుగుల నాగమల్లేశ్వరి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, యోహాన్, వెన్న వెంకి, రోజ్‌మేరి పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి ఉండాలి

తాళ్లూరు: ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం అండర్-14, అండర్-17 విభాగాల్లో క్రీడల పోటీలను ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌కే ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. తొలుత పాఠశాల చైర్మన్ షేక్ షమ్‌షద్ బేగం క్రీడలను ప్రారంభించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపిక చేస్తామని హెచ్ఎం తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: క్రీడలు విద్యార్థుల్లో శారీరక మానసిక స్థితిని పెంపొందించి ధృడంగా తయారు చేస్తాయని ఎంఈఓలు కె.తులసీ మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గణపవరం ఏపీఆర్ స్కూల్ వద్ద విద్యార్థులకు శుక్రవారం క్రీడల పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఏపీఆర్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మోహన్‌రెడ్డి, పీడీలు పి.రామ్మోహన్‌రెడ్డి, డేవిడ్, రాధ, వరలక్ష్మి, భానుమతి, కామేశ్వరరావు, బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం




ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

దర్శి: స్థానిక క్రిష్టియన్ పాలెంలో నివసిస్తున్న గొంగటి పిచ్చయ్య (42) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబ దీన పరిస్థితిని తెలుసుని దర్శి మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి వేణు, డైరెక్టర్లు సుశీలమ్మ, సుబ్బారావు, మోషే, ప్రేమకుమార్, శ్రీనివాసరావు, సింగంశెట్టి మల్లిలు సంస్థ తరపున రూ.5 వేల చెక్, చైర్మన్ దేవతి వరప్రసాద్ రూ.1000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా మానవత సభ్యులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాక్సిన్

పుల్లలచెరువు: గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకా వేయనున్నారని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి నాగూల్‌మీరా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పశువులకు వ్యాక్సిన్ వేసి మాట్లాడారు. ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. దీంతో పాడి పశువుల్లో పాడి తగ్గిపోతుందని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టీకాలు వేసే కార్యక్రమం అక్టోబర్ 15 వరకు ఉంటుందని, గ్రామాల్లోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది హిమబిందు, నాగరాజు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సభ్యులు

దర్శి: లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో మండలంలోని రాజంపల్లిలో ఇటీవల వర్షానికి ఇల్లు కూలిన యన్నాబత్తిన రమణమ్మ అనే నిరుపేద మహిళకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. విక్రమ్ కేర్ ఆర్థో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లంకపోతు విక్రంసింహారెడ్డి చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమానికి గ్యాట్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, గైడింగ్ లయన్ బూదాటి ఆంజనేయులు, క్లబ్ ప్రెసిడెంట్ తమ్మవరపు ఫణిబాబు, సెక్రటరీ పానుగంటి బీవీ సత్యనారాయణ గుప్తా, ట్రెజరర్ జి.అశోక్, క్లబ్ సభ్యులు యనుమల నర్సారెడ్డి, అంబటి గోవిందరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బాబ్జిన్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, బిజ్జం నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.